గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు ముమ్మరం



వంటిల్లు వద్ద జాతీయ రహదారిపై వేసిన బారికేడ్లు



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వద్ద కొత్తగా వేసిన బీటీ రోడ్డు

- రహదారులు సిద్ధం
- జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు

గోపాలపట్నం: గిరిప్రదక్షిణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం నుంచి జాతీయ రహదారి వరకు పలు చోట్ల కొత్తగా బీటీ రోడ్లు వేశారు. చాలా చోట్ల రహదారులకు మరమ్మతులు చేపట్టారు. వంటిల్లు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై భక్తుల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై భారీ వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో ఈ ఏర్పాట్లు చేశారు. ఈ బారి కేడ్ల లోనుంచే భక్తులు నడవాలని పోలీసులు కోరుతున్నారు. భక్తులకు మంచినీరు మందులు అందించేందుకు దేవస్థానం అధికారులు టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.

భక్తులంతా అప్రమత్తంగా ఉండాలి

గోపాలపట్నం: ఈ నెల 2న జరిగే సింహాచలం గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. సింహగిరి ప్రదక్షిణకు వచ్చే వారు తమ వెంట విలువైన వస్తువులు, బ్యాగులు, నగలు తీసుకురావద్దని కోరారు. స్నానాల ఘట్టాల వద్ద అపరిచిత వ్యక్తులకు మీ విలువైన వస్తువులు ఇవ్వొద్దన్నారు. మీ వాహనాలు పోలీసులు సూచించిన ప్రాంతాల్లోనే పార్క్‌చేయాలని, విలువైన వస్తువులను డిక్కీల్లో ఉంచొద్దని చెప్పారు. వాహనాలకు హ్యాండిల్ లాక్, ఫోర్క్ లాక్ వేసుకోవాలన్నారు. అపరిచితుల నుంచి ప్రసాదాలు తీసుకోవద్దని కోరారు. గిరి ప్రదక్షిణకు వెళ్లే వారు ఇళ్లకు తాళాలు వేసుకోవాలని సీఐ సూచించారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు సత్కారం



సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మల్కాపురం: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్.. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టి శుక్రవారం నాటికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ఆయనను పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఆడారి ఆనంద్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ, ముర్రు వాణి, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ 40, 61, 62, 63 వార్డుల పరిశీలకుడు భోగవల్లి నాగభూషణం, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత, కొల్లి నూకరెడ్డి, అంగ రామ్‌ప్రసాద్, పీలా మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీ దేవి, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ధనలక్ష్మీ దేవివి ప్రధాన అర్చకుడు శ్యామా ఆచార్యులు, దుర్గమాంబకు ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొరియన్ భాషతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న కిమ్ హంగ్ జాయ్

సీతమ్మధార: కొరియన్ భాష నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలా కియా కంపెనీలో చాలా మంది ఉద్యోగాలు సంపాదించారని కొరియాలోని సొంగోక్ యూనివర్సిటీ అంబాసిడర్ కిమ్ హంగ్ జాయ్ స్పష్టం చేశారు. ద్వారకానగర్‌లోని ఇన్నార్ భవనంలో జూలై 1 నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని, మేయర్ గొలగాని హరివెంకటకుమారి శనివారం కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 10+2 పాలిటెక్నిక్, ఐటీఐ చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు, టెక్నికల్ స్కిల్స్ కలిగిన ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారికి కొరియన్ భాషలో కనీస పరిజ్ఞానం ఉంటే నెలకు రూ.లక్ష వేతనం లభించే అవకాశాలున్నాయన్నారు. రెండు నెలల్లో కొరియా భాష నేర్చుకునేలా సర్టిఫికెట్ కోర్సు విశాఖలో ప్రారంభం కానుందని చెప్పారు. ఆసక్తి గల వారు 87902 79628 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యాక్ సాత్ కొరియన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’పై అవగాహన



జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని 458, 459, 476, 477, 478, 479 సచివాలయాల్లో జగన్న సురక్ష కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివావసరావు, అప్పలస్వామి నాయుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందే విధంగా ఇంటింటికీ వెళ్లి వారి వివరాలు సేకరించాలని సూచించారు. వలంటీర్లు గృహసారథులు, కన్వీనర్లు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలన్నారు.

సచివాలయాల వారీగా కార్యక్రమాలు ఇలా

- 6న బాజీ జంక్షన్‌లోని రాజీవ్ మినీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమానికి 471, 472, 481 సచివాలయాల పరిధిలో వారు హాజరు కావాలి. అదే రోజు 481, 482, 483 సచివాలయాలకు సంబంధించి గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలోని ఇండోర్ స్టేడియంలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.
- జీవీఎంసీ 92 వార్డు పరిధిలో 11న 458, 459, 460 సచివాలయాల పరిధిలో కంపరపాలెం 459 సచివాలయం వద్ద సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే అదే రోజు 476, 477, 478, 479 సచివాలయాల పరిధిలో వారికి గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజలు దరఖాస్తులు సంబంధిత అధికారులకు అందజేస్తారన్నారు.

పర్యావరణ హితంగా గిరిప్రదక్షిణ



సత్యం జంక్షన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్ తదితరులు

సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్‌కుమార్ పిలుపు

సీతమ్మధార: గిరిప్రదక్షిణను విజయవంతం చేద్దాం .. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. హైవేపై సత్యం జంక్షన్ వద్ద శుక్రవారం జీవీఎంసీ, గ్రీన్ వలంటీర్స్, సిఫా, గ్రీన్ క్లైమేట్ టీమ్, గ్రీన్ అంబాసిడర్స్ టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ, టెక్ మహీంద్రా ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా జిల్లా అధికారుల ఆదేశాలను అనుసరించి ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. ఆహార పదార్థాలు, ప్రసాదాలను నేలపై, రహదారి మీద పడేయవద్దని కోరారు. విశాఖ ఎన్‌జీవో ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ విద్యా సంస్థల్లోని అధిక సంఖ్యలో విద్యార్థులకు గిరిప్రదక్షిణను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు అవగాహన కలిస్తున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ సంస్థ కార్యదర్శి జె.వి.రత్నం, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ‘హరిత విశాఖ అందరి లక్ష్యం’ అనే నినాదంతో కూడిన ప్లకార్డులతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 375 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూలకు 314 మంది అభ్యర్థులు హాజరవగా.. 149 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వారే నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని సుబ్బిరెడ్డి తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో కొత్తగా నియమితులైన వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నియామక పత్రాలు అందించారు. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్లు సైనికుల్లా పని చేయాలని సూచించారు.తమ పరిధిలో ఉన్న నివాసీయుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,పలు వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, పుర్రె సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సన్మానం



వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ హాల్‌షాప్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహించిన ఎస్. రామారావు (రాంజీ), సూపర్‌వైజర్ ఎస్.రాజారావు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారిని హాల్‌షాప్ డిపార్ట్‌మెంట్‌లో పలు ట్రేడ్‌ల కార్మికులు,డిపార్ట్‌మెంట్ సీనియర్ మేనేజర్ రఘు,మేనేజర్ ప్రకాష్ తదితరులు ఘనంగా సత్కరించారు. అంతక ముందు రాంజీ,రాజారావులు షిప్‌యార్డ్ వ్యవస్థాపకుడు వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కిక్ బాక్సింగ్ విజేతకు అభినందన



మెడల్ సాధించిన క్రీడాకారుడిని అభినందిస్తున్న జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో విజేతగా నిలిచిన సతీష్ కుమార్‌ను శుక్రవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. ఈ నెల 24, 25న విశాఖలో ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 63 కిలోల విభాగంలో విజేతగా నిలిచాడు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శాంతినగర్‌లోని తన కార్యాలయంలో సతీష్‌కుమార్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అంబటి నాగరాజు, వెదుళ్ల శ్రీనివాసరావు, కిరణ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో సుమారు 35 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని మగ మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. సదరు మృతుడు ఫిట్స్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అతడి పేరు, చిరునామా వివరాలు తెలియలేదు. ఇతడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఎవరికైనా మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వాల్తేర్ డివిజన్‌లో భద్రతా తనిఖీలు



డీజిల్ లోకోషెడ్ వద్ద తనిఖీలు చేస్తున్న సేఫ్టీ ఆడిట్ బృందం



విశాఖ-రాయగడ సెక్షన్‌లో బ్రిడ్జిని పరిశీలిస్తున్న బృంద సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ సెంట్రల్ రైల్వే, హాజీపూర్‌కు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ శివకుమార్ ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక భద్రతా ఆడిట్ బృందం వాల్తేర్ డివిజన్, విశాఖపట్నం-రాయగడ సెక్షన్‌లోని పలు ప్రధాన స్టేషన్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. భద్రతా సంబంధిత అంశాలపై మల్టీ డిసిప్లీనరీ బృంద రైల్వే అధికారులు ఇతర డివిజన్, జోన్‌ల పరిధిలో అప్పుడప్పుడు ఇటువంటి తనిఖీలు చేస్తుంటారు. ఈ బృంద సభ్యులు విశాఖలోని ఓర్ ఎక్స్‌చేంజ్ యార్డ్, డీజిల్ లోకోషెడ్‌లతోపాటు సెక్షన్ పరిధిలో వంతెనలు, లెవెల్ క్రాసింగ్స్, మలుపులు, పాయింట్స్, క్రాసింగ్స్‌లతోపాటు రాయగడ స్టేషన్‌లోని రన్నింగ్ రూం, క్రూ లాబీ, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో చీఫ్ ట్రాక్ ఇంజినీర్ ముకేష్ కుమార్, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్ రావిష్‌కుమార్, చీఫ్ సిగ్నల్ ఇంజినీర్ ఆర్.ఎల్.యాదవ్, చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ ఆర్.పి.భర్తి, వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), మోనిష్ బ్రహ్మ, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ అధికారులు, బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డులకు దరఖాస్తులు

మహారాణిపేట: నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్, వాటర్(సముద్రం) కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. జీవిత కాల సాధన సాహస కృత్య కేటగిరీల్లో గత మూడేళ్ల కాలంలో అద్భుతమైన పని తీరు కనబరిచి విజయం సాధించిన వ్యక్తులు అర్హులన్నారు. వివరాలు, దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి https:// awards. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అప్‌లోడ్ చేసిన పత్రాలు, నామినేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును ఈనెల 4వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేటలో పని వేళల్లో సమర్పించాలని ఆయన కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 10 ఫిర్యాదులు

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో 2వ జోన్‌కు రెండు, 5వ జోన్‌కు 4, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 3.. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధి, ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం డంప్ చేసినా జీవీఎంసీలో టోల్ ఫ్రీ నంబరు 18004250009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ 8187897569కు పూర్తి వివరాలతో పంపితే చర్యలు చేపతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న లక్ష్మణ్

కొమ్మాది: జ్యూస్ షాప్‌లో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సాగర్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద శ్రీ సిద్ధి వినాయక జ్యూస్ అండ్ మిల్క్ షేక్ సెంటర్ ఉంది. ఇందులో బానాల లక్ష్మణ్ (19) పని చేస్తున్నాడు. ఆయన ఐదేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈ యువకుడు గతంలో ఎండాడలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలల కిందట ఇక్కడ సాగర్‌నగర్‌లోని జ్యూస్ సెంటర్‌లో పనికి చేరాడు. యజమాని నాగిరెడ్డి ఢిల్లీరావు పనితో పాటు ఎంవిజీ సముదాయంలోని ఆయన ఇంట్లోనే నివాసం ఉండేందుకు అవకాశం కల్పించాడు. అప్పటి నుంచి లక్ష్మణ్ ఇక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి యథావిధిగా వ్యాపారం ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకుని అందరూ కలసి భోజనం చేసి నిద్రించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీరావు లేచి చూసేప్పటికి లక్ష్మణ్ కనపడక పోవడంతో షాప్‌కు వెళ్లి చూశారు. షటర్ ఎత్తి చూడగా లక్ష్మణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ ఎస్ఐ అప్పారావు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా-తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్ శనివారం రద్దు చేశారు. 2న తిరుపతి-హౌరా(22890) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4న ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ - సంత్రగచ్చి(22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

- విశాఖపట్నంలో శుక్రవారం రాత్రి 9.05 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం- కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖపట్నంలో శనివారం బయలుదేరాల్సిన విశాఖపట్నం-బెంగళూరు కంటోన్మెంట్ (08915) వన్‌వే స్పెషల్ సుమారు 2 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భువనేశ్వర్ లో జూలై 6న భువనేశ్వర్- సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడ, నల్గొండలో ప్రయోగాత్మక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గౌహతి-సికింద్రాబాద్ స్పెషల్

గౌహతి-సికింద్రాబాద్(05614) స్పెషల్ జూలై 2వ తేదీ ఉదయం 6 గంటలకు గౌహతిలో బయలుదేరుతుంది. మరుసటి రోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-గౌహతి(05613) స్పెషల్ సికింద్రాబాద్‌లో జూలై 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 11.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 12.50 (మధ్య రాత్రి) గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.